క్లుప్తంగా

బిడ్డలకు పాలిచ్చే గది ప్రారంభం



గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో తల్లులు బిడ్డలకు పాలిచ్చే గదిని గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పీ వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలింతల సౌకర్యార్థం బస్‌స్టాండ్‌లో బిడ్డలకు పాలిచ్చే గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సీహెచ్ నాగపద్మావతి, డీ ధనలక్ష్మి, పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

కంకిపాడు: అదనంగా చార్జీలు వసూలు చేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ వీ భావనారాయణ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెవిన్యూ శాఖకు సంబంధించిన సేవలను మీ సేవ, సచివాలయాల ద్వారా పొందేందుకు యూజర్ చార్జీలను ప్రభుత్వం నిర్ధేశించిందని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు మీసేవ, సచివాలయాల ద్వారా 53 రకాల సేవలు పొందే క్రమంలో నిర్ధేశించిన యూజర్‌చార్జీలు మాత్రమే చెల్లించాలని సూచించారు.

పేరంటాలమ్మకు ప్రత్యేక పూజలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ దేవత పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీపద్మావతి శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో చాలీసా రామాయణం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెనమలూరు: గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు అవ్వడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ పకీర్‌గూడెంకు చెందిన కే దీపక్ లిఫ్ట్ పనులు చేస్తాడు. అతను బైక్‌పై మొవ్వకు వెళ్లి తిరిగి వస్తుండగా విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి గోసాల గ్రామ పరిధిలో పెట్రోల్ బంక్ వద్ద వన్‌వేలో ఎదురుగా వచ్చిన ఆటో అతని బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో దీపక్ కాళ్లు, చేతులకు బలమైన గాయాలు అయ్యాయి. బాధితుడిని పోరంకిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహానందీశ్వరుడికి అభిషేకం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో శ్రీమహానందీశ్వర స్వామివారికి అభిషేకం, అర్చన చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆరుగురికి జైలు శిక్ష

హనుమాన్‌జంక్షన్ రూరల్: విధి నిర్వహణలో ఉన్న వీఆర్వోపై అనుచితంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన ఆరుగురు వ్యక్తులకు నూజివీడు కోర్టు 15 రోజుల జైలు శిక్ష, రూ.3 వేలు చొప్పున జరిమానా విధించింది. వివరాల్లోకి వెళ్లితే.. బాపులపాడు మండలం మల్లవల్లిలో 2021లో అప్పటి వీఆర్వో సైసం వరప్రసాద్ సత్యనారాయణ విధి నిర్వహణలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లారు. అయితే అదే గ్రామానికి చెందిన కన్నెగంటి భూషణరావు, ప్రభాకరరావు, కోటేశ్వరరావు, రమ్య, శివకుమారి, నువ్వుల విజయలక్ష్మి విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై వీఆర్వో వరప్రసాద్ సత్యనారాయణ వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై నూజివీడు కోర్టులో విచారణ జరిగింది. నేర నిరూపణ కావడంతో ఆరుగురు ముద్దాయిలకు 15 రోజుల సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున జరిమానా విధించారు.

అడ్డగోలుగా ఇసుక రవాణా

- నిబంధనలకు విరుద్ధంగా లారీల్లో అధిక లోడింగ్
- ధ్వంసమవుతున్న రహదారులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



కంకిపాడు-గన్నవరం రోడ్డులో అధిక లోడుతో వెళుతున్న ఇసుక లారీలు



కంకిపాడు వద్ద అధిక లోడుతో ఉన్న ఇసుక లారీలు

కంకిపాడు: ఇసుక రవాణా అడ్డగోలుగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా భారీ లారీల్లో ఇసుక రవాణా అవుతోంది. పరిమితికి మించి లోడింగ్ చేయించుకుని యథేచ్ఛగా రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నాయి. ఫలితంగా రోడ్లు ధ్వంసమై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇసుక రోడ్లపై జారుతుండటంతో ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. దీంతో మన ల్నెవడ్రా ఆపేదీ అన్నట్లు ఇసుక లారీల యజమానులు అడ్డగోలుగా ఇసుక తరలిస్తున్నారు.

కృష్ణానది ఏటిపాయ వెంబడి పెనమలూరు నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు మండలాలు ఉన్నాయి. వీటితోపాటు సమీపంలోని పామర్రు నియోజకవర్గం రొయ్యూరు పరిసర ప్రాంతాల నుంచి కూడా ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇసుకతో నిండిన భారీ లోడు లారీలు, ఇసుక ట్రాక్టర్లు ప్రధానంగా రొయ్యూరు-కంకిపాడు, మద్దూరు-గోసాల ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు తరలిపోతున్నాయి.

నిత్యం వందల లారీలు

ఈ ప్రాంతాల మీదుగా నిత్యం వందల సంఖ్యలో ఇసుక లోడుతో ఉన్న లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇసుక రవాణా వాహనాల బాడీ మట్టానికి కాకుండా అంతకు మించి లోడు చేయిస్తున్నారు. ఈ విధంగా ఇసుక రవాణా సాగించడం నిబంధనలకు విరుద్ధం. కొందరు వాహనదారులు పైన పట్టలు కప్పుతున్నారు. కొందరు అయితే ఆ పట్టలను కూడా వాడటం లేదు. అడ్డగోలుగా ఇసుక లోడు చేయించి రోడ్లపై దూసుకుపోతున్నారు. దీని కారణంగా రహదారుల మార్జిన్‌లు కుంగి ధ్వంసమవుతున్నాయి. పగటి వేళ కంటే రాత్రిళ్లు అధిక సంఖ్యలో ఇసుక లోడు వాహనాలు సంచరిస్తుండటం గమనార్హం.

ప్రమాదాలకు కేరాఫ్

ఇసుక లోడుతో వెళ్తున్న వాహనాలు నుంచి ఇసుక జారిపడి రోడ్ల మార్జిన్‌లు ఇసుకమయం అవుతున్నాయి. మార్జిన్‌లలో ఉన్న ఇసుక కనిపించకపోవడంతో ద్విచక్రవాహనాలు జారిపడి గాయపడుతున్న సంఘటనలు ఇటీవల అధికమవుతున్నాయి. రాత్రిళ్లు ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇసుక రవాణా కారణంగా రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల చర్యలు శూన్యం

అధిక లోడు వాహనం కనిపిస్తే చాలు వాటిని పట్టుకుని జరిమానాలు విధించే అధికార యంత్రాంగం నేడు కనిపించడం లేదు. రవాణా, రెవిన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలకు సంబంధించిన ఏ ఒక్క అధికారి కూడా రోడ్లపై తనిఖీలు చేయడం లేదు. దీంతో ఇసుక వాహనాల యజమానులు అధిక లోడు చేయించుకుని ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రహదారులు దెబ్బతింటున్నా, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



చిరుధాన్యాలను అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

గన్నవరం: ఆరోగ్యకర సమాజం, నేల సారవంతం కోసం రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను పండించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ సూచించారు. ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామ సచివాలయంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో నానాటికి పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం వల్ల పెట్టుబడి ఖర్చులు పెరగడంతోపాటు భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆహారం, నీటి కాలుష్యం పెరిగి ప్రజలు రోగాల బారిన పడటం వంటి దుష్ప్రభావాలను ఎదురుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను సాధించవచ్చని సూచించారు. ప్రకృతి సాగులోని మొక్కల వేరు వ్యవస్థ పటిష్టంగా ఉండడంతో ఇటీవల సంభవించిన వరదలకు నీటి ముంపును పంటలు తట్టుకుని నిలబడ్డాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులు గుర్తించి ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. పొలం గట్లును పెద్దవి చేసుకుని వాటిపై కూరగాయలు, పండ్లు పండించాలని, వాటి ద్వారా వచ్చే లాభాలు వ్యవసాయ పెట్టుబడిని భర్తీ చేస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిగల రైతులకు చిరుధాన్యాలను పంపిణీ చేశారు. అనంతరం పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అభ్యుదయ రైతు కోగంటి శ్రీరామ్‌ప్రసాద్ ఇంటిని కలెక్టర్ సందర్శించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. కేఆర్‌ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ పార్థసారథి, తహసీల్దారు విమలకుమారి, సర్పంచి బండి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొలంబడి పంట శాంపిల్స్ సేకరణ

ఉయ్యూరు రూరల్: విత్తు నుంచి విత్తు తయారీ కోసం ఇండో- గ్యాప్ ఆధ్వర్యంలో పొలంబడి పంట శాంపిల్స్ సేకరణ కార్యక్రమం మండలంలోని పెద్ద ఓగిరాల గ్రామంలో గురువారం జరిగింది. సందర్భంగా గన్నవరం ఏడీఏ సునీల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ ఉత్పత్తులను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగానే రైతులు విత్తనాల ద్వారా సాగు చేసి పంటలు పండించిన అనంతరం మరలా తిరిగి విత్తనాలను తయారు చేయడం జరుగుతుందన్నారు. ఆయా విత్తనాల్లోని నాణ్యత ప్రమాణాలు, వృద్ధి ప్రమాణాలను తెలుసుకునేందుకు చినబోగిరాల గ్రామ పరిధిలో 15 మంది రైతులకు చెందిన భూముల నుంచి మినుము విత్తనాలను సేకరించడం జరిగిందన్నారు. ఒక్కో శాంపిల్‌కు 267 పరీక్షలు నిర్వహించి వాటి యొక్క ప్రమాణాలను ప్రకటించడం జరుగుతుందన్నారు. దీనికి తోడు నాణ్యత ప్రమాణాలు అధిక మొత్తంలో ఉన్న విత్తనాలు ఉత్పత్తి చేసిన అన్నదాతలకు తగిన గుర్తింపుతో సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. తద్వారా ఆ రైతులు గ్రామాల్లోని ఇతర రైతులకు బహిరంగంగా విత్తనాలను అమ్మకాలు చేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో అన్నదాతలకు అన్ని సౌకర్యాలతో కూడిన విత్తనాలను ఆయా గ్రామాల్లోని రైతుల నుంచి పొందవచ్చు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ షరీఫ్ అహ్మద్, ఉయ్యూరు మండల వ్యవసాయ శాఖ అధికారి నిస్సి గ్రేస్, ఏఈఓ సునీల్ గవాస్కర్, పీ కేజియా, వీపీఏ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పాదయాత్ర



కంకిపాడు పై ఓవర్ మీదుగా సాగుతున్న పాదయాత్ర



కానూరులో మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా గురువారం ముస్లింలు ఆటోనగర్ నుంచి మచిలీపట్నం వరకు మహా పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రకు ముస్లింలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సంఘ నేతలు మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలవారు కలిసిమెలిసి ఉన్నారన్నారు. అయితే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మత స్వేచ్ఛ, మానవహక్కులు హరిస్తోందని ఆరోపించారు. బీజేపీ అవలంబిస్తున్న విధానాల వల్ల మతాల మధ్య చిచ్చురగిలే విధంగా ఉందని ఆందోళణ వ్యక్తం చేశారు. అన్ని మతాలు కలిసి ఉంటేనే దేశం బలంగా ఉంటుందన్నారు. చంద్రబాబునాయుడు కూటమితో చేతులు కలిపి ముస్లిం సమాజానికి తీరని అన్యాయం చేశారన్నారు. చంద్రబాబు వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు పలకడంతో ఆయన సెక్యులర్ నాయకుడు కాదని తేలిపోయిందని ఆరోపించారు. వక్ఫ్ బిల్లు రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని ముస్లిం సంఘ నేతలు స్పష్టం చేశారు.

ఉయ్యూరు రూరల్: మైనారిటీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్టీ పిలుపునిచ్చారు. బీసీ సమైక్య వేదిక విజయవాడ నుంచి మచిలీపట్నంకు పాదయాత్ర జరుగుతున్న నేపథ్యంలో గురువారం ఉయ్యూరులో ఆవాజ్, సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనకు మద్దతుగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఆవాజ్, సీఐటీయూ కమిటీ నాయకులు కోసూరు శివనాగేంద్రం, ఎస్‌ఏ సలీం, ఎస్కే కాసిం, బీ రాజేష్, ఎన్ గోపాల్, బీ కీర్తి పాల్గొన్నారు.

కంకిపాడు మీదుగా

కంకిపాడు: వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటోనగర్ నుంచి మచిలీపట్నం వరకూ చేపట్టిన పాదయాత్ర గురువారం కంకిపాడు చేరుకుంది. వక్ఫ్ సవరణ బిల్లుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాగిస్తున్న విచ్ఛిన్నకర విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. పాదయాత్రకు వైఎస్సార్ సీపీ సంఘీభావం తెలిపింది. కంకిపాడు మసీదు సెంటరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ, సీపీఎం నేతలు ప్రసంగించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేత శొంఠి నాగరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత అన్నే చిట్టిబాబు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మద్దతు

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి డిమాండ్ చేశారు. కానూరులో గురువారం ముస్లింలు చేపట్టిన మహా పాదయాత్రకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ముస్లింలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి నేడు వక్ఫ్ బిల్లుకు మద్దతు పలకడం దారుణమని విమర్శించారు. ముస్లిం సమాజానికి వైఎస్సార్ సీపీ ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముస్లిం హక్కుల కోసం పోరాడుతామని తెలిపారు.

నున్నలో రోడ్డు నిర్మాణ పనులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం ఎస్సీ కాలనీలో గ్రామ పంచాయతీ నిధులు రూ. 19 లక్షలతో సిమెంటు రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ముందుగా డ్రెయిన్ నిర్మించడం జరుగుతుందని ఏఈ శివరామకృష్ణ తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు రోడ్డును రూ. 9 లక్షలు, డ్రెయిన్ రూ. 10 లక్షల అంచనా వ్యయంతో పనులు చేస్తున్నామని పేర్కొన్నారు.

అధిక లోడు లారీలతో వంతెనకు ప్రమాదం

- ఇసుక లారీలను అడ్డుకున్న ఉప్పలూరు గ్రామస్తులు
- కంకిపాడు-గన్నవరం రోడ్డుపై నిరసన



అదనపు లోడుతో వెళ్తున్న ఇసుక లారీలను అడ్డుకున్న ఉప్పలూరు గ్రామస్తులు

కంకిపాడు: అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలతో వంతెనకు ప్రమాదం పొంచి ఉందంటూ ఉప్పలూరు గ్రామస్తులు గురువారం నిరసనకు దిగారు. కంకిపాడు-గన్నవరం రోడ్డు మార్గంలో రాకపోకలు సాగిస్తున్న అధిక లోడు ఇసుక లారీలను ఉప్పలూరు వంతెన వద్ద అడ్డుకుని ఆందోళన చేపట్టారు. రైవస్ కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో పాటుగా శ్లాబు పగుళ్లు వారి క్రమేపీ పెద్దవి అవుతున్నాయని, భారీ లోడు వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండటంతో వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఎమ్మెల్యే ఈ మార్గంలో తిరుగుతున్నా సమస్య పట్టించుకోడా? అంటూ ప్రశ్నించారు. రోడ్ల అభివృద్ధి పట్టించుకోవడం లేదని, కనీసం వంతెనలను అయినా మరమ్మతులు చేయాలంటూ నినాదాలు చేశారు.

ఆందోళనతో నిలిచిన ట్రాఫిక్

గ్రామస్తులు చేపట్టిన ఆందోళనతో కంకిపాడు-గన్నవరం రోడ్డు మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. భారీ లోడు వాహనాలు రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకుంటామని, రోడ్డు మార్గంలో గడ్డర్లు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా నేత బండెల సుబ్బారావు, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాసరావు, గ్రామస్తులు నెరుసు రమేష్, మాగంటి వెంకటేశ్వరరావు, వెంగల నాగయ్య, నెరుసు శ్రీమన్నారాయణ, మాణిక్యాలరావు, నెరుసు శ్రీనివాసరావు, కలపాల ప్రభాకర్‌రావు, లాం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం



కోలవెన్నులో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి



తేలప్రోలులో జరిగిన అవగాహన ర్యాలీలో సర్పంచ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

పెనమలూరు: పోషకాహారం ప్రాముఖ్యతపై తల్లులు అవగాహన పొందాలని కానూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ విజయలక్ష్మి అన్నారు. గ్రామంలోని వినాయక్‌నగర్‌లో గురువారం పోషక పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. తల్లి గర్భం నుంచి చిన్నారికి రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తల్లులు తమంతట తామే పోషణ ట్రాక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ సీఎంఏఎం ద్వారా పోషకాహార లోపాలు నివారించవచ్చని వివరించారు. పిల్లల్లో ఊబకాయం తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వణుకూరులో..

వణుకూరు, గంగూరు, గోసాల గ్రామాల్లో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాలు, అనుబంధ పోషకహార పద్ధతులపై తల్లులకు కౌన్సిలింగ్ చేశారు. పిల్లలకు తల్లి పాలు ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామ సచివాలయంలో గురువారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచి లాం దిబోరా మాట్లాడుతూ.. తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీ పద్మావతి మాట్లాడుతూ.. మహిళలు అధిక పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, తోటకూర వంటి ఆహారం తీసుకోవాలని సూచించారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. వార్డు సభ్యుడు వింత శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎన్ రాజేంద్రవరప్రసాద్, ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ సునీత, డాక్టర్ ప్రచేతన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు రూరల్: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషన్ పక్వాడ పక్షోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న భోగిరాల గ్రామ సర్పంచ్ వెనిగళ్ల శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంకిపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజినీ తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యం

కంకిపాడు: సమతుల్యత ఆహారంతో తల్లీ బిడ్డ ఆరోగ్యం సాధ్యమని కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎస్ అన్నామణి అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కోలవెన్ను శివారు క్రిస్టియన్‌పేటలో అవగాహన గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్నామణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించుకోవాలన్నారు. కోలవెన్ను ఉపసర్పంచ్ కంచర్ల వెంకటరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ రజని, సీహెచ్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



గన్నవరం డిపో వద్ద నిరసన తెలుపుతున్న సంఘ నేతలు

గన్నవరం: సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ పీటీడీ ఎస్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు గురువారం స్థానిక డిపో ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం డిపో కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రతకు సంబంధించిన సర్క్యులర్ 1/2009 అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను నిలిపివేయాలని కోరారు. పదోన్నతులను వెంటనే ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ. 150 నుంచి రూ. 400 వరకు చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని కోరారు. సంఘం డిపో అధ్యక్షుడు శ్రీనివాసరావు, గ్యారేజ్ కార్యదర్శి ఆంజనేయులు, సంఘ నేతలు రాజు, బాబీ, నాని, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అంతర్గత నైపుణ్యాలు పెంపొందాలి



రామవరప్పాడు: విద్యార్థులు ఉన్నత ఉద్యోగ సాధనకు విద్యతోపాటు అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ డాక్టర్ కే మధుమూర్తి సూచించారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధుమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అవకాశాలతో పాటు చాలెంజ్‌లు కూడా ఉన్నాయని వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. అనంతరం కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బీఎస్ అప్పారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, సెక్రటరి శ్రీకృష్ణ, ఏట ప్రతాప్, టీపీవో శివనాగేశ్వరరావు, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ M/s. LIC Housing Finance Ltd., Vijayawada వారి సంజాయిషీ ప్రకారం తెలియచేయునదేమనగా :

1) పాము వినయ్ @ వినయ్ కుమార్ and 2) పాము సుధీత్ @ సుజిత్ కుమార్ Kumar as 1st Party / site owners and M/s. Sri Rama Associates, Vijayawada షెడ్యూల్ స్థలములో Sai Suseela Enclave Residential building ను కట్టుటకు జాయింట్‌గా Regd. DGPA dated 31-12-2022 (Doc. No. 17526/2022 of Patama SRO) ను వ్రాసుకొని యున్నారు. సదరు బిల్డింగ్‌లో Smt. Mathangi Lakshmi and Mathangi Pradeep అను వారలు ఒక ఫ్లాట్‌ను, నా క్లైంట్స్ ద్వారా హౌసింగ్ లోన్ పొంది క్రయం పొందుటకు నిర్ణయించుకున్నారు. Schedule ఆస్తికి చెందిన లింకు దస్తావేజు అనగా original Regd. Will dt. 05-07-2004 (Doc. No. 112/2024) గతంలోనే పోయినదనియూ, నేటి వరకూ దొరకలేదనియు నా క్లైంట్స్‌కు తెలుపుచున్నారు. కావున షెడ్యూల్ ఆస్తిపై ఎవరికైననూ ఏ విధమయిన క్లయిములు, అభ్యంతరములు వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోపుగా క్రింది అడ్రసుకు వ్రాతపూర్వక ఆధారములతో తెలియజేయవలెను. తదుపరి వచ్చు క్లయిములు వగైరాలు నిర్వివాదాంశమనియు, నా క్లైంట్సు గానీ, సదరు Smt. Mathangi Lakshmi and Mathangi Pradeep ని గానీ బైండ్ చేయవని తెలియజేయడమైనది.

Schedule Property : House site in extent of 276.5 sq. yards or 231.18 sq. meters in Rs. No. 57/2, Old Door No. 13-62, Old Asst. No. 1586, Door No. 11-346, Asst. No. 5292, Yanamalakuduru Village, Tadigadapa Municipality, Krishna District being bounded by East : Panchat Road, South : Property of P. Sravani, West : Property of Sri Ramalingeswara Swamy Devasthanam, North : Property of Madala Rajya Lakshmi.

Vijayawada, Date : 10-04-2025

P.Ramakrishna Paramahamsa, Advocate.
30-10-19, Durga Agrabaram, Vijayawada-2.
AP/598/1986, Cell : 9866335633

రోడ్లు, డ్రెయినేజీల ప్రారంభం



రామవరప్పాడు: గన్నవరం నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సిండికెట్ బ్యాంక్ కాలనీలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిండికేట్ బ్యాంక్ కాలనీ, రామాలయం వీధి, ఎన్టీఆర్ పార్కు రోడ్డు తదితర ప్రాంతాల్లో యార్లగడ్డ పర్యటించారు. సిండికేట్ బ్యాంక్ కాలనీ చివరి ప్రాంతంలో వీధిలైట్లు లేకపోవడంతో వాటిని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి, టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్‌కుమార్, ఉప సర్పంచ్ అద్దెపల్లి సాంబు, నభిగాని కొండ, బొమ్మసాని అరుణ తదితరులు పాల్గొన్నారు.